''మనలో మనం పోట్లాడితే మేం అయిదుగురం, మీరు నూర్గురు. పరాయివాళ్ళతో పోట్లాడితే మనం. నూటైదుగురం."యిది ధర్మరాజు నీతి. ఈనీతిని ఆచరిస్తున్న ఆడవాళ్ళకు జోహార్లు అర్పించవలసిందే

# ఆడవాళ్ళూ! మీకు జోహార్లు



కన్నెపల్లి గోపాలకృష్ణ

"పిల్లాడేదో సరదా పడ్డాడు. నాలుగు జాంకాయలు కోసుకున్నాడు. అంతమాత్రాన నీ సొమ్మేదో పోయినట్టు గొంతు చించుకొని ఎందుకు అరుస్తావూ? పిల్లాడు భయపడడూ? అసలే అర్భకం వెధవ. అయినా వాడేం తప్పు చేశాడు? మా వేపు వచ్చిన కొమ్మల తాలూకు కాయలే కోశాడు. అంతే కానీ నీ పెరట్లోకి వచ్చాడా? నీ ఇంట్లో చొరబడ్డాడా? నీ సొంత సొమ్మేదో పోయినట్టు ఎందుకలా కేకలేస్తావ్? ఛీ ఛీ యింత పీనాసి మనుషులను నేనెక్కడా చూడలేదమ్మా" కొంగు ఎగగట్టుకొని, చేతులు చిత్రంగా తిప్పుతూ అరుస్తోంది మీనాక్షమ్మ.

''ఎవరూ! మేమా పీనాసివాళ్ళం? ఈ వీధిలో ఉన్న వాళ్ళందరికీ ఎవరు పీనాసివాళ్ళో బాగా తెలుసు. ఒక్క రోజైనా ఒక్క ముష్టి వాడికైనా పిడికెడు బియ్యం వేశావా? ఓ పింకి గుడ్డైనా ధర్మం చేశావా? ఎప్పుడూ ఫో, ఫో- అని తరిమెయ్యడమే గాని ఎంగిలిచేత్తో కాకికి విదిలించనిదానివి నన్ను ఎక్కిరిస్తున్నావా? ఇంతోటి ధర్మాత్ములు ఈ

జిల్లా ఎట్టుపక్క లలేరని అందరూ చెప్పుకుంటున్నారు" తానుకూడా తీసిపోనట్టు కథాకళి చేస్తోంది కామాక్షమ్మ.

"మా గురించి అంగరూ ఎందుకు చెప్పుకుంటారమ్మా? మా పిన్ని కూతురు పారిపోయిందనా? లేకపోతే మా అత్తగారి తమ్ముడు ఎవరి పీకైనా పిసికాడనా? మేం అనామకులం- మా గురించి ఎవరూ చెప్పుకో నఖ్ఖరలేదు. ఆ పేరంతా నీకే ఉంది. మహాతల్లీ! పేరు సంపాదించుకో" రెండుచేతులూ జోడిస్తూ అంటున్నది మీనాక్షమ్మ.

"మే మెందుకు మహాతల్లుల మవుతాం! నువ్వే మహాతల్లివి. మరిడమ్మవి మా వాళ్ళని నువ్వు అంటున్నావే. నీ సంగతి తెలియదూ? మా అత్త కూతురేమి మొగుడ్ని ఉంచుకొని పక్కింటి వాడితో కులకలేదు మా దొడ్డమ్మని ఆస్తి రాయమని ఎవ్వరమూ చిత్రహింసలు చెయ్యలేదు మా అత్తగారి తోటికోడలెవరూ దొంగతనం చేస్తూ దొరికిపోలేదు. ఆ ఘనతంతా మీకేనమ్మా! మాకేమీ అలాంటి ఘనతలఖ్ఖర్లేదు."

"ఏ సంగతి నాకు తెలియదూ? చుట్టాలొస్తే బియ్యం లేవని పెరట్లోంచి వచ్చి పట్టికెళ్ళలేదూ! ఆ పూటకి గతిలేనిదానివి నువ్వే కూడా మాట్లాడుతున్నావే?" వెటకారంగా దీర్ఘం తీస్తూ అంది మీనాక్షమ్మ

"ఏమన్నావే! నాకు పూటకి గతిలేదా? అవసరాలు అందరికీ వస్తాయని గుర్తుంచుకోవే. నేను బియ్యం పట్టికెళ్ళినా, మరోటి పట్టికెళ్ళినా ఠంచనుగా తీర్చేస్తున్నాను. నువ్వో? ప్రతి వాళ్ళ దగ్గరా అప్పులు తేవడం, తీర్చక పోవడం. అసలు నువ్వీ వీధిలో అప్పుతేని ఇల్లుందా అని? నీ నోటికి జడిసి. ఎవరూ తిరిగి అడగడం లేదు ఎవ్వరి సంగతో ఎందుకు? రెణ్నెల్ల క్రితం కప్పుడు పంచదార ఇచ్చానా ఇంతవరకు గతిలేదు. అంతకు ముందు పప్పులూ, ఉప్పులూ, నూనెలూ ఎన్నిసార్లో" నాలుగడుగులు ముందుకేసి చేతులు యూడిస్తూ అరుస్తోంది కామాక్షమ్మ.

"ఓ! అంతటి ధర్మాత్మురాలు తయారయిపోయిందమ్మా! పిల్లాడు నాలుగు జాం కాయలు కోసుకుంటే ఇల్లెగిరిపోయేట్టు అరిచింది గానీ ఉప్పులూ, పప్పులూ ధర్మం చేసిందట. నిజంగా పుస్తకాల్లో రాయాల్సిన విషయమే!"

"పుస్తకాలు రాయడానికీ, చదవడానికీ మేమేం పోరంబోకుల్లా కూర్చోలేదు.



అవన్నీ నీకే చెలుతాయి. పోసుకోలు కబుర్లు చెప్పుతూ అందర్నీ ఆడి పోసుకోవడమేగా నీ పని! అసలు మా ఆయన్ని బుద్ధి తక్కువ. మా పక్కన మిమ్మల్ని దింపడమేమిటీ? నీతో మాట్లాడం కుక్కనోట్లో నోరు పెట్టడమే" అంటూ లోపలికి వెళ్ళబోయింది కామాక్షమ్మ.

"ఎమిటేమిటీ? కుక్కలమా? దొంగ గాడిదా! ఎంత మాటన్నావె" అంటూ రంకెలేస్తూ ముందుకు కదిలింది మీనాక్షమ్మ.

"నన్ను గాడిద అంటావే! నువ్వే గాడిద. నీ అమ్మే గాడిద." అంటూ. కొంగు బిగించికడుతూ ముందుకురికింది కామాక్షమ్మ.

ఇంతవరకూ తగువునంతా చిత్రంగా చూస్తూ వున్న ఆ వీధి వాళ్ళందరూ ఈ పరిణామానికి గాభరాపడ్డారు. ఇంకా చేతులు కలవక ముందే నలుగురు ఆడవాళ్ళు కలిసి బలవంతంగా విడిపించారు.

తిట్ల వర్షం అయిపోయాక అలసిపోయిన కామాక్షమ్మ, మీనాక్షమ్మ ఒకర్నొకరు గుర్రుగా చూసుకుంటూ, ముక్కులు చీదేస్తూ "నీ పని తేలుస్తానంటే నీ పని తేలుస్తా న"ను కొని, ఇంట్లోకి వెళ్ళిపోయారు.

ఆ రోజల్లా ఇద్దరిళ్ళు గిన్నెల చప్పుడు గ్లాసుల చప్పుడుతో మారుమ్రోగిపోయాయి. పిల్లల మీద, కుక్కల మీద, కాకుల మీద పెట్టి ఇళ్ళలోంచి కేకలేసుకుంటూనే వున్నారు.

* * *

నర్సమ్మ ఆ రెండిళ్ళకీ కంబైన్డ్ పని మనిషి దాన్ని కామాక్షమ్మే ఇద్దరిళ్ళలోనూ పన్లోకి చేర్చింది.

"నర్సమ్మా. ఈ ఉప్మా తినే" అంటూ ఆకుతో కొంచెం ఉప్మా యిచ్చింది మీనాక్షమ్మ.

నర్సమ్మ ఉప్మాని అందుకుంటూ "అమ్మగారూ మీరేమి దెబ్బలాడకపోతే చిన్నమాట" అంది భయంగా.

"ఎందుకమ్మా దెబ్బలాడతాను. నీ కష్టసుఖాలు ఇంకెవరితో చెప్పుకుంటావు? భయంలేదు చెప్పు" అంది శాంతంగా మీనాక్షమ్మ.

"మరేమీ లేదమ్మగారూ, ధరలు పెరిగి పోతున్నాయికదా! ఇంకో రూపా యెయ్యండి అమ్మగారూ" అంది భయం భయంగా నర్సమ్మ.

"ఏమిటీ! ఇంకో రూపాయి వెయ్యాలా? ఇదేం ఇల్లనుకున్నావా? రూపాయలు కాసే చెట్టనుకున్నావా? తొమ్మిది రూపాయలు పుచ్చుకుంటున్నావు- నీ కెంత సిగ్గులేదే జీతం పెంచమనడానికి! ధరలు నీ కొక్కదానికే మండిపోతున్నాయా? మాకు మాత్రం మండిపోవడం లేదూ! కామాక్షమ్మా.... ఓ కామాక్షమ్మా! వింటున్నావా నర్సమ్మ మాటలు" తారాజువ్వలా ఎగురుతూ కామాక్షమ్మని పిల్చింది మీనాక్షమ్మ.

అప్పటికే ఈ మాటలన్నీ వింటున్న కామాక్షమ్మ గబుక్కున మీనాక్షి పెరట్లోకి వచ్చి "విన్నాను మీనాక్షక్కయ్యా దీని మాటలు. అయినా నర్సమ్మా నీకేం పోయె కాలమే జీతం పెంచమంటున్నావు- ఇంకా రెండు సంవత్సరాలు కాలేదు. రూపాయేసి పెంచాం. మళ్లా యిప్పుడు పెంచమంటున్నావ్! ఇలా అయితే ధర్మం కాస్తుందిటే నీకు?" కళ్ళు చిత్రంగా తిప్పుతూ అడిగింది కామాక్షమ్మ.

"అదికాదమ్మగారూ! ధరలు...."

"ధరలు నీకే పెరిగిపోతున్నాయా. మేం మాత్రం సంసారులం కామూ! మాకు మాత్రం ధరలు పెరిగిపోవడం లేదా! మాకు ఇష్టమైతే పెంచుతాం కానీ, నువ్వడిగినప్పుడలా పెంచుతామా! ఇదేం బాంకీ అనుకున్నావా?" అంది కామాక్షమ్మ.

"అలా అడుగే కామాక్షీ! మనం దీనికేమిటి లోపం చేశాం? టిఫిన్ చేసుకుంటే టిఫిన్ పెడ్తున్నాం. అన్నం మిగిల్తే అన్నం ఇస్తున్నాం. సొంత దానిలా చూసుకుంటూవుంటే ఇది జీతాలు పెంచమని నస పెడ్తూంది. విశ్వాసం లేదు. ఈ పని వాళ్ళకి" అంటూ "కామాక్షీ! 'డ్రైవర్ రాముడు' సిన్మాకి సాయంకాలం వెళ్గామా?" అంది మీనాక్షమ్మ.

"అలాగే నక్కయ్యా! ఎన్టీరామారావు, జయసుధ ఉన్నారంట" అంటూ కామాక్షమ్మ, మీనాక్షమ్మ ఇద్దరూ కబుర్లలో పడ్డారు.

ఒకర్నొకరు చంపుకుంటారు కాబోలు అన్నట్టు నిన్న దెబ్బలాడుకున్నారు. ఈరోజు ఇంత స్నేహమేమిటో! అనుకుంటూ తెల్లబోయి చూస్తోంది నర్సమ్మ. ●




## గ్యాస్టిక్ వ్యాధులు

మీరు కడుపునొప్పి, కాన్‌సిపేషన్, అజీర్ణం, మరియు అన్ని విధములైన కడుపు వ్యాధులవలన బాధపడుతున్నారా! మా స్పెషల్ ఆయుర్వేదిక్ గ్యాస్టిక్ చూర్ణం వాడి పూర్తిగా నివారించండి. ధర 1 ఫిల్ రు. 20/- పూర్తి కోర్సు రు. 50/- పోస్టేజి అదనం.

**R. N. Gupta & Co (G)**
P. o. Lal Bigha (Gaya)

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్టు



వివాహము వాయిదా వేయనవసరంలేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనములకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.

రావ్స్ క్లినిక్
టి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700, 1010.

SUVARNA

## చెవుడుకు చికిత్స

చెవినుంచి చీము కారడం, చెవిలో పెద్ద ధ్వని రావడం, చెవుడు లేదా చెవికి సంబంధించిన ఏదేని అనారోగ్యము పూర్తిగా నయము చేయబడును. ధర రు. 20/-పూర్తి కోర్సు రు. 50/-లు ఉపయోగపడనట్లు ఋజువైతే సొమ్ము వాపసు.

**BASANT CHIKITSALAYA (D. F.)**
**P. o. Katri Sarai (Gaya)**